క్లుప్తంగా

ప్రతి పల్లెలో సిమెంట్ రోడ్లు నిర్మించాం

టీఆర్ఎస్ నేత సయ్యద్ హఫీజ్



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కొందుర్గు: బీఆర్ఎస్ పార్టీ హయాంలోనే ప్రతి పల్లెకి సిమెంట్ రోడ్లు వేయడం జరిగిందని ఆ పార్టీ జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ అన్నారు. సోమవారం చౌదరి గూడలో రూ.5 లక్షలతో చేపడుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులను సర్పంచ్ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా హఫీజ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సహకారంతో ప్రతి గ్రామానికి బీటీరోడ్లు, గల్లీ గల్లీకి సిమెంట్ రోడ్లు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, జబ్బార్, అనిల్, నర్సింగ్‌రావు, వెంకటేష్, చంద్రబాబుగౌడ్, రాములు, మానయ్య, మోతీలాల్, శేఖర్, శివరాజ్, జావీద్ పాల్గొన్నారు.

నియమనిష్టలతో పూజలు



పెద్దపెల్కిచర్లలో పూజలో పాల్గొన్న శివస్వాములు

కొందుర్గు: శివమాలాధారణ చేసిన ప్రతి ఒక్కరూ నియమనిష్టలతో పూజలు నిర్వహించాలని గురుస్వామి భూపాలచారి అన్నారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్ల గ్రామంలోని ఎల్లీరన్న దేవాలయం వద్ద శివస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, బిల్వార్చన చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శివస్వాములు నర్సింలు, బుగ్గయ్య, బాల్‌రాజ్, సాయి, చిన్నా, వీరేష్, చెన్నయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



పరీక్ష ప్యాడ్‌లు అందుకున్న విద్యార్థులు

నందిగామ: మండల పరిధిలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన యాదయ్యయాదవ్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సోమవారం పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో యాదయ్య జ్ఞాపకార్థం ఎంతో కొంత తమకు తోచిన సహాయంగా విద్యార్థులకు పరీక్షల ప్యాడ్‌లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాము, సురేందర్,అనిల్ రెడ్డి, తేజయాదవ్, మహేందర్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ సందర్శన



పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీసీపీ, ఏసీపీ

నందిగామ: మండల కేంద్రం నందిగామలోని పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ కుషాల్కర్‌లు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, ఫైల్స్‌ను తనిఖీ చేశారు. అనంతరం వారు సిబ్బంది వివరాలను ఇన్‌స్పెక్టర్ రామయ్యను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కొత్తగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, తొందరలో నూతన పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తామని డీసీపీ తెలిపారు. కొత్తూరు పోలీస్ స్టేషన్‌ను కూడా సందర్శించారు.

నేడు ఆరోగ్య వ్యాయామాలు

చేవెళ్ల: నేడు అన్ని ఆరోగ్య సబ్‌సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ప్రజలకు ఆరోగ్యకరమైన వ్యాయామాలు నేర్పించనున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 14వ తేదీన అన్ని సబ్ సెంటర్లు, అంగన్‌వాడీల వద్ద ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రజలకు ఆరోగ్యకరమైన యోగా, జాగింగ్, సైకిల్ మారథాన్, జుంబా తదితర వ్యాయామాలు ఆరోగ్య సిబ్బంది ప్రజలకు, గర్భిణులకు నేర్పిస్తారని చెప్పారు. దీనిని ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణులకు నార్మల్ డెలివరీలు అయ్యేందుకు కూడా ఉపయోగపడుతాయని చెప్పారు. డివిజన్‌లోని అన్ని ఆరోగ్య వైద్యాధికారులు, సీహెచ్ఓలు, ఇతర పర్యవేక్షణ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి పాల్గొనాలని సూచించారు.

పారిశ్రామికవాడలో వసతుల కరువు

- ధ్వంసమైన రోడ్లు, వెలగని లైట్లు
- నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుతున్న షెడ్లు
- పట్టని అధికారులు

కొత్తూరు: గతంలో రాష్ట్రంలోనే వెనుకబడిన జిల్లాగా పేరొందిన పాలమూరులో వలసలను నియంత్రించి జిల్లాను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో అప్పటి సీఎం జలగం వెంగళరావు హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న కొత్తూరు మండలకేంద్రంలో 1976వ సంవత్సరంలో పారిశ్రామికవాడను ఏర్పాటు చేశారు. మొదట్లో పారిశ్రామికవాడలో సుమారు 60నుంచి 80 వరకు చిన్న తరహా, పెద్ద పరిశ్రమలు ఏర్పాటైయ్యాయి. పారిశ్రామిక వాడకు రోడ్డు, రైలు, రవాణా సౌకర్యంతో పాటు హైదరాబాద్‌కు అతి దగ్గరగా ఉండడంతో రెండేళ్ల లోపే వందలో సంఖ్యలో పరిశ్రమలను నెలకొన్నాయి. గతంలో పారిశ్రామిక వాడలో నెలకొన్న ఆయా పరిశ్రమల కోసం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ట్రాన్స్‌పోర్ట్ లారీలతో పాటు కార్మికులతో పారిశ్రామిక వాడ నిత్యం కిటకిటలాడేది. బీహార్, ఒడిస్సా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన వేల మంది కార్మికులు ఉపాధి నిమిత్తం మండలానికి వచ్చి జీవనోపాధి సాగించేవారు. కాగా, గత కొన్నేళ్ల నుంచి వివిధ కారణాల వల్ల పలు పరిశ్రమలు మూత పడడం... మరికొన్ని పరిశ్రమలు కాలుష్యం కారణంగా మరో చోటుకు తరలిపోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది.

నెలకొన్న సమస్యలు..

- ప్రస్తుతం పారిశ్రామికవాడలో చాలా షెడ్లు నిర్వహణలో లేక శిథిలావస్థకు చేరుకున్నాయి.
- అంతర్గత రోడ్లకు గత కొన్నేళ్ల నుంచి కనీస మరమ్మతులు లేక గుంతలమయంగా మారాయి. వర్షాకాలంలో ఈ రోడ్డుపై నుంచి రాకపోకల సాగించాలంటే చాలా కష్టతరంగా ఉంది.
- ఆయా ప్రాంతాల నుంచి పరిశ్రమలకు సరుకులు తీసుకెళ్లడం, తేవడానికి వచ్చే డ్రైవర్లు, కార్మికులు విశ్రాంతి తీసుకునేందుకు విశ్రాంతి గదులు లేవు.
- తాగునీరు, టాయిలెట్స్ లేక కార్మికులు, డ్రైవర్లు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.
- ముఖ్యంగా వీధి దీపాలు లేక పారిశ్రామికవాడలోని అంతర్గత రోడ్లపై చీకట్లు అలుముకుంటున్నాయి.



శిథిలావస్థకు చేరిన షెడ్లు

గత వైభవం వచ్చేనా..?

ప్రస్తుతం కొత్తూరు మండలం హెచ్ఎండీఏ పరిధిలోకి రావడంతో హైదరాబాద్ సమీపంలోని పలు చిన్న తరహా పరిశ్రమల నిర్వాహకులు మండలంలోని పారిశ్రామికవాడలో పలు పరిశ్రమలను నెలకొల్పే ప్రయత్నంలో ఉన్నారు. కొందరు పరిశ్రమల నిర్వాహకులు ఇప్పటికే పారిశ్రామికవాడతో పాటు పలు ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటు కోసం భూములను సైతం కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పాలకులు స్పందించి పరిశ్రమలను ఇక్కడే ఏర్పాటు చేసి పారిశ్రామికవాడకు గత వైభవాన్ని తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి



పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమలకు నిత్యం ఆయా రాష్ట్రాల నుంచి లారీలు వస్తుంటాయి. లోడింగ్, అన్‌లోడింగ్ సమయంలో పరిశ్రమల్లో ఏర్పాట్లు లేని కారణంగా డ్రైవర్లు రోడ్డుపైనే వేచి ఉంటున్నారు. దానికి తోడు హమాలీలు, కార్మికులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పారిశ్రామికవాడలో విశ్రాంతి గదులు, తాగునీరు, ఇతర సౌకర్యాలను కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– పర్వతాలు, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు

అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి

డీఎల్‌పీఓ మల్లారెడ్డి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ మల్లారెడ్డి

కొత్తూరు: షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో అక్రమ కట్టడాలను పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు నిర్మాణ దశలోనే అడ్డుకోవాలని డీఎల్‌పీఓ మల్లారెడ్డి ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం కొత్తూరు, నందిగామ మండలాల పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల చివరి వరకు వందశాతం పన్నులు వసూలు చేయడంతో పాటు పంచాయతీల్లో పారిశుద్ధ్య సిబ్బంది తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. ప్రతినెల పంచాయతీల్లో ఆదాయం..ఖర్చులు, రాబడి వివరాలను సక్రమంగా రిజిస్టార్‌లో నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం ఎలక్షన్‌కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాల్లో మోడల్‌కోడ్ అమలు చేయాలని వివరించారు. ముఖ్యంగా కార్యదర్శుల వద్దకు వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కొత్తూరు ఎంపీడీఓ శరత్ చంద్రబాబు, కొత్తూరు, నందిగామ మండలాల ఎంపీఓలు నర్సింలు, గిరిరాజ్, రెండు మండలాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ సీనియర్ నేత పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామంలో సోమవారం మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న పలు పథకాలకు కేంద్రం సాయం చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా ప్రచారం చేయడం లేదన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌చారి, మాణిక్యం, మోహన్‌సింగ్, ప్రేమేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమేష్, నర్సింహ్మా, శేఖర్, శ్రీధర్‌చారి, హరికృష్ణ పాల్గొన్నారు.

పాడి పరిశ్రమతో గ్రామాలు అభివృద్ధి

రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి



పశువులకు పరీక్ష చేస్తున్న పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: పాడి అభివృద్ధితోనే గ్రామాలు ఆర్థికంగా, సామాజికంగా స్వయం సమృద్ధిని సాధిస్తాయని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. 35 పశువులకు చూడి నిర్ధారణ పరీక్షలు, 15 పశువుల్లో గర్భకోశ వ్యాధి చికిత్సలు, నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో పశువులకు వైద్యం అందిస్తూ అధిక పాల దిగుబడి రాబట్టవచ్చునని చెప్పారు. మేలు రకం పశువుల ఎంపిక ద్వారా అధిక ఆదాయం పొందవచ్చున్నారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే మంచి లాభాలు వస్తాయన్నారు. నాణ్యమైన గడ్డీజాతులు, దాణా, అందించడం వల్ల మరింత ఆర్థిక లబ్ధి పొందవచ్చన్నారు. పాడి పశువుల ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు, డాక్టర్ల సలహాలు తీసుకుని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శకుంతల, ఎంపీటీసీ సునితా, పశువైద్య సిబ్బంది శ్రీనివాస్, రైతులు తదితరులున్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేష్, జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం



శివకుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న మహేష్, సుబ్రహ్మణ్యం

షాబాద్: అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేష్, జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ ప్రజా సంఘం సమావేశం నిర్వహించారు. అనంతరం మండల ఉపాధ్యక్షుడిగా కర్రె శివకుమార్, జాయింట్ సెక్రటరీలుగా నీరటి యాదయ్య, చర్లగూడెం నర్సింహులులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల కోసం నిరంతరం శ్రమించాలన్నారు. సామాజిక ఆర్థిక సమానత్వం కోసం ప్రతి ఒక్కరు పోరాడాలన్నారు. అసమానతల సమాజంలో సమ సమాజం కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హరిప్రసాద్, సంఘం నాయకులు నీరటి అంజయ్య, సత్తయ్య, నరిసింహా తదితరులున్నారు.

ప్రేమికుల దినోత్సవాన్ని నిషేధించాలి

షాద్‌నగర్‌టౌన్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు విరుద్ధంగా ఫిబ్రవరి 14న నిర్వహిస్తున్న ప్రేమికుల దినోత్సవాన్ని నిషేధించాలని సోమవారం హిందూ వాహిని నాయకులు అయోధ్య శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. ప్రేమకు తాను వ్యతిరేకం కాదని, భవిష్యత్‌ను ఏమాత్రం ఆలోచించకుండా ప్రేమ పేరుతో పార్కులు, పబ్బులకు వెళ్లి తెలిసి, తెలియని వయస్సులో చేసే పొరపాట్లు జీవితాలను నాశనం చేస్తాయని పేర్కొన్నారు. యువత భవిష్యత్‌పై దృష్టి పెట్టాలని కోరారు. తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా నడుచుకొని బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవాలని సూచించారు. పార్కుల్లో తిరిగే యువతీ యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగిస్తామని పేర్కొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వాహకులు బీకే లక్ష్మి



జెండాను ఆవిష్కరిస్తున్న నిర్వాహకురాలు బీకే లక్ష్మి, సర్పంచ్ శైలజ తదితరులు

చేవెళ్ల: యోగాతో మనిషి ఒత్తిడి నుంచి మానసిక ప్రశాంతత పొందుతారని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వాహకురాలు బీకే లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం శివ జయంతి ఉత్సవాల్లో భాగంగా శివ పతావిష్కరణ, జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను బెంగుళూరు నుంచి వచ్చిన మంజునాథ్‌బాయ్, స్థానిక సర్పంచ్ బండారి శైలజతో కలిసి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరమాత్మ గుర్తించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు యోగా చేయాలన్నారు. ప్రజలు నేను, నాది అనే ఆహంకారం వదిలి అందరం సమానమే అని జీవించాలని చెప్పారు. పరమాత్ముని దృష్టిలో ప్రజలంతా సమానమేనని అందుకే ఆయన గురించి, మన జీవిత సత్యాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని తెలిపారు. బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో నిర్వహించే శివ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి సభ్యులు బాల్‌రెడ్డి, వేణుగోపాల్‌చారి, పాండుయాదవ్, గోపాల్, దయానంద్, నర్సింహ్మ, సంతోష్, శశికళ, భాగ్యలక్ష్మి, స్రవంతి, పద్మ, మంజు, తదితరులు పాల్గొన్నారు.

ఖబరస్థాన్ స్థలాన్ని కాపాడండి!



మున్సిపల్ కమిషనర్ వెంకన్నకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని ముస్లింలకు సంబంధించిన జంగ్ ఏ షాహీద్ ఖబరస్థాన్ స్థలాన్ని కాపాడాలని కోరుతూ సోమవారం ముస్లిం కౌన్సిలర్ల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ వెంకన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముస్లిం ఖబరస్థాన్ అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జంగ్ ఏ షాహీద్ ఖబరస్థాన్ స్థలాన్ని సర్వే చేయించాలని కోరారు. ఖబరస్థాన్ చుట్టూ ఉన్న కొంత స్థలం అన్యాక్రాంతం అయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అభివృద్ధి చర్యల్లో భాగంగా చుట్టూ ప్రహరీ నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేసినప్పటికీ అమలుకు నోచుకోలేదని, ఆ నిధులను ఇతర పనులకు వెచ్చించినట్లు తెలిపారు. వెంటనే నిధులను మంజూరు చేసి ఖబరస్థాన్ స్థలాన్ని రక్షించాలని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో కౌన్సిలర్లు సర్వర్‌పాషా, గౌస్ నాయకులు మహ్మద్‌ఎజాజ్ (అడ్డు), రహ్మత్, షబ్బీర్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న అవినాశ్‌రెడ్డి, తదితరులు

షాబాద్: మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కుర్వగూడ గ్రామంలో రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ సంధ్యారాణి, ఎంపీటీసీ వనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి అన్ని రంగాల్లో గ్రామాలను అభివృద్ధి పరిచేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గత 70 ఏళ్ల కాలంలో ఏ ప్రభుత్వాలు, ఏ ముఖ్యమంత్రులు చేపట్టని అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు మల్లికార్జున్‌గౌడ్, శ్రీను, వెంకటేష్, నర్సింహులు, గ్రామస్తులు, వార్డు సభ్యులు తదితరులున్నారు.

ఘనంగా శివపడిపూజ



పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య.

చేవెళ్ల: మండలంలోని ఇంద్రారెడ్డినగర్‌లో శివ మాల ధరించిన స్వాములు సోమవారం శివ మహాపడి పూజ చేశారు. ఇంద్రారెడ్డినగర్‌కు చెందిన శివస్వాములు, కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంటయ్య గౌడ్ ఆధ్వర్యంలో పడి పూజను సురేశ్ గురుస్వామి వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పడిపూజలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొని పూజలు చేశారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మండలపార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, నాయకులు పాండు యాదవ్, యాదయ్య, శేఖర్‌రెడ్డి, నరేందర్, శివారెడ్డి ఉన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలేవీ?

- సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ ఆదేశాలు పట్టని అధికారులు
- కాంగ్రెస్‌నేత మహ్మద్ అలీఖాన్ బాబర్

షాద్‌నగర్: గ్రంథాలయ భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారని కాంగ్రెస్ నేత మహ్మద్ అలీఖాన్ బాబర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రంథాలయ భవన నిర్మాణంలో సదరు కాంట్రాక్టర్ అవకతవకలకు పాల్పడినా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అవకతవకలపై చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులే కాంట్రాక్టర్‌కు అండగా ఉన్నారని తెలిపారు. గ్రంథాలయ భవన నిర్మాణంలో నాణ్యతను పాటించకుండా నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టాను సారంగా భవనాన్ని నిర్మించారని, ఈ విషయాన్ని ఎన్నిసార్లు అధికారులకు లిఖిత పూర్వకంగా విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. సదరు కాంట్రాక్టర్‌పై పూర్తి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ గీతారాధిక ఇచ్చిన ఆదేశాలను కింది స్థాయి అధికారులు బేఖాతరు చేశారని మండిపడ్డారు. కాంట్రాక్టర్‌పై అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రజల గోసకు బీజేపీ భరోసా

మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపీ

మొయినాబాద్: రాష్ట్రంలో ప్రజలు పడుతున్న గోసకు బీజేపీ భరోసాగా నిలుస్తుందని మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మొయినాబాద్ మండల కేంద్రంలో బీజేపీ కార్నర్ మీటింగ్ నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సక్రమంగా అందించకుండా మోసం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.లక్షల కోట్ల నిధులు ఇస్తున్నా సీఎం కేసీఆర్ కేంద్రం నిధులే ఇవ్వడంలేదని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కేంద్ర పథకాలను ప్రజలకు అందేలా చూసి వారికి భరోసా కల్పించేందుకు కార్యకర్తలంతా కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కంజర్ల ప్రకాష్, మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, శ్రీరాంనగర్ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, పద్మనాభం, నాయకులు లక్ష్మీ పతియాదవ్, ప్రభాకర్‌రెడ్డి, రాజ మల్లేష్, వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంధత్వ రహిత సమాజమే లక్ష్యంగా ‘కంటి వెలుగు’



శిబిరాన్ని పరిశీలిస్తున్న జయలక్ష్మి, కమిషనర్ వెంకన్న తదితరులు

శంకర్‌పల్లి: కంటి వెలుగు కార్యక్రమం పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని మహాలింగపురం సర్పంచ్ మాణిక్యరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మహాలింగపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యర్శి రాఘవేందర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి..

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో సోమవారం రెండవ విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ..18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారికి సరోజిని ఆస్పత్రికి రెఫర్ చేయడం జరుగుతుందని చెప్పారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకన్న, వైద్యులు విజయలక్ష్మి, స్రవంతి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, అమృత, రమాదేవి, తుకారాం, భారతి, అశ్విని, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రాసుమల్లగూడలో..

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాసుమల్లగూడ గ్రామంలో నిర్వహిస్తున్న ‘కంటివెలుగు’ను జయలక్ష్మి పరిశీలించారు. ప్రజలకు కంటి పరీక్షలను నిర్వహించి సకాలంలో అద్దాలను అందజేయాలని సూచించారు. గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం మూడు రోజుల పాటు నిర్వహిస్తామని, కంటి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జయప్రకాష్, చంద్రకళ, ఆనంద్, అశ్విని, సుజాత పాల్గొన్నారు.